ప్రక్కింటి గుర్నాధానికి మాకూ పడదు. ఎంచేతంటే కుళాయి దగ్గర నా శ్రీమతి విజయ, గుర్నాధం పెళ్ళాం రాజేశ్వరీ రోజూ దెబ్బలాడుకుంటారు. సరిపెట్టుకు పోదామని ఎవరికీ తెలీదు. రెండు మిడిల్ క్లాసులు ప్రక్క ప్రక్క వుంటే ఏ విషయానికైనా పోటీయే! ఆఖరికి డోర్ కర్టెన్ దగ్గర కూడాను. అలా వాళ్ళ దెబ్బలాటలు మూడు దెబ్బలు, ఆరు వార్నింగుల్లా వృద్ధి చెందుతున్న రోజుల్లో-

నాకు ప్రావిడెంటుఫండు లోను శాంక్షనయింది.

నీళ్ళ కుళాయి దెబ్బలాట ఆగిపోయింది.


అంటే నేను వేరే కుళాయి వేయించుకున్నాననుకునేరు. అర్థం లేదు.

## మరో కుళాయి తగువు!

అసలు నా పి.ఎఫ్. లోను శాంక్షనవడానికీ, నీళ్ళ కుళాయి తగువు ఆగిపోడానికీ ఏమిటీ సమ్మంధం?

లోను తీసుకున్న నేను పరాసరి బజారువెళ్ళి జేసీపీ వారి కళ్యాణీ టీ.వి. కొని ఆటోలో వేసుకొని వచ్చేశాను.

మర్నాడే- హైదరాబాద్ కేంద్రం మంచి తెలుగు కార్యక్రమాలు రిలే!



"రామాయణంలో పిడకలవేట" సినిమా టెలికాస్టు.

"ఏంటో విజయగారూ... మనం మనం దెబ్బలాడుకోడమేగానీ కార్పొరేషన్‌వాడు మరో అరగంట నీళ్ళు వదలడు కదా. అన్నట్టు మీ టి.వి. ఎలాగుంది? ఇవాళ సినిమా అట కదా?" రాజేశ్వరి విజయకు నీళ్ళ బకెట్ అందిస్తూ.

రాజేశ్వరి ఎంచక్కా అన్ని ప్రోగ్రాములూ మా టి.వీ.లో చూస్తోంది!

తర్వాత మరి కుళాయి తగువులు లేవు!

ఇప్పుడు నేకోరుకునేదల్లా ఒహటే... రాజేశ్వరీ వాళ్ళాయన టి.వి. కొనకూడదు...

అందుకే వాళ్ళాయన పెట్టుకున్న లోను శాంక్షన్ కాకుండా చూసేందుకు క్లర్కుకి పాతిక రూపాయిల కట్నం సమర్పించుకున్నాను.

— గుడిమెట్ల గోపాలకృష్ణ

# కాలమ్ దాటని కథలు

నేను ఎన్నో రోజులుగా పిచ్చి వాళ్ళ గురించి ఒక కథ రాద్దామనుకున్నాను. ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళ్ళటం జరిగింది. ఎలాగైనా వచ్చాం కదా ఒకసారి పిచ్చాసుపత్రికి వెళ్ళి క్షుణ్ణంగా పరిశీలించి కథ వ్రాస్తే బాగుంటుందనిపించింది. అంతే- వెంటనే ఆచరణలో పెట్టాను.

## పిచ్చాసుపత్రిలో ఒక రోజు

ముందుగా సూపరింటెండెంట్ దగ్గర పర్మిషన్ తీసుకొని లోపలికి అడుగు పెట్టాను. అక్కడ ఏప్రాను వేసుకున్న వ్యక్తి ఒకాయన తారాసపడ్డాడు. నమస్కరించి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. వచ్చిన పని చెప్పాను. అతను ఒక్కొక్క రూమ్ దగ్గరకు తీసుకెళ్ళి



వాళ్ళు ఎలా పిచ్చివాళ్ళు అయ్యారో వివరంగా చెప్పటం మొదలు పెట్టాడు.

మొదట రూమ్‌లో వున్న వ్యక్తి ఒక ప్రొఫెసర్. అధికంగా చదవటం వల్ల అక్కడకు రావలసి వచ్చిందట! "రెండవ రూములో వున్న వ్యక్తి ఒక భార్యా బాధితుడు. ఈ గదిలో అదిగో ఆ పేషంట్‌కి రాజకీయాల పిచ్చి, ఈ ఎదురు గదిలో వున్న వాడికి లాటరీల పిచ్చి" అని చెబుతూ, "ఐదవ రూమ్ నాది" అంటూ ఒక్క పరుగున వెళ్ళి మంచం మీద దూకాడు.

నాకు అప్పటి దాక ఎక్స్‌ప్లెయిన్ చేసింది వాళ్ళను ట్రీట్ చేస్తూ అలా తయారైన డాక్టరా లేక......?

—నిమ్మల కృష్ణమూర్తి

కల్లు కాంపౌండ్‌లో కూర్చుని చెరొక సీసా పూర్తి చేసి, కొద్దిసేపటి క్రితమే రెండో సీసా ప్రారంభించారు- మల్లేష్, భిక్షపతి. వాళ్ళ పరిచయం ఒక నెలం క్రితం ఆ కాంపౌండ్‌లోనే జరిగింది. కొద్ది కాలంలోనే ఇద్దరూ బాగా దోస్తులయిపోయారు. అన్నం తినకుండా వుండమన్నా వుంటారు గానీ కల్లు లేకుండా మాత్రం ఒక్క

## మంగళసూత్రం మగాళ్ళకేస్తే...

రోజు కూడా బతకలేరు. అప్పుడే రెండో సీసా కూడా పూర్తి కావచ్చింది. వేయించిన ఎండు చేప ముక్కొకటి నోట్లో వేసుకుని రోడ్ మీద వయ్యారంగా నడిచి పోతున్న 'జీన్స్ పాంట్'ని చూస్తూ-

"మగాల్లు చీరకట్టి జడేసుకుని, ఆడాల్లు క్రాపు కొట్టి పాంట్లేసుకుంటే బాగుంటది కదరా భిక్షపతి" అడిగాడు మల్లేష్.

"ఛూ! నీయవ్వ! ఇంక జరసేపుంటే ఆడోల్లకి బదులు మనల్నే పిల్లల్ని కనమనేటట్టున్నావు. ముందు



నువ్వా 'మయిలా మండలి' కొలువు బంద్ జెయ్యెహ; అన్న జేరిన్దగ్గర్నుండి ఇలా పొగల్నాకొడుకువై పోయినవ్" కసురుకున్నాడు భిక్షపతి. మల్లేష్ ఏమీ మాట్లాడలేదు. ఇంకా ఏమన్నా అంటే ఇంకెంత 'గుస్సా అయితడో'అని ఊరుకుండి పోయాడు. జేబుల్లో పైసలయిపోయేదాకా తాగి, ఇద్దరూ మెల్లగా ఇళ్ళకు బయల్దేరారు.

"ఒరేయ్ భిక్షపతీ, ఆడాల్లే మగాల్లకి తాలి కడితే ఎట్లుంటదిరా" దారిలో మళ్ళీ అడిగాడు మల్లేష్.

"నీయవ్వ. నీగ్గూడా జబర్దస్తయిడియా లొస్తున్నయి గదరా మల్లిగా. అట్టాగైతే బలే వుంటుందిరా. మందు కొట్నేకి పైసల్లేకపోతే 'సీతాలియ్యే' అని తాలిబొట్టు కోసం పెల్లాన్ని కొట్టే పనే వుండదు. గది మన మెడలోనే వుంటది గదా! మంచిగా అమ్ముకోవచ్చు" ఉషారుగా అన్నాడు భిక్షపతి.

- డి. రాజారెడ్డి